సాక్షి
మెదక్
గురువారం । 14 । డిసెంబర్ । 2023


బారులు తీరిన మహిళలు

ఈకేవైసీ బారులు

ఈకేవైసీ కోసం మహిళలు గ్యాస్ డీలర్ ఆఫీసు వద్ద బుధవారం బారులు తీరారు. ఇది నిరంతరంగా సాగే ప్రక్రియని అధికారులు ఇప్పటికే ప్రకటించారు. అయినా ఎక్కువ సంఖ్యలో జనాలు తరలివస్తున్నారు. గంటల తరబడి క్యూలో నిల్చుంటున్నారు. గ్రామాలకు సిబ్బందిని పంపుతామని వారు తమ వద్దకే వస్తారని, ఈ ప్రక్రియను పూర్తి చేస్తారని భరోసానిచ్చారు. కాగా ఎక్కువ సంఖ్యలో జనాలు రావడంపై విచారం వ్యక్తం చేశారు. -నర్సాపూర్

న్యూస్‌రీల్

ఎమ్మెల్యే తరఫున ఆర్థిక సాయం


బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

రామాయంపేట(మెదక్): అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ ఆదేశాల మేరకు కాంగ్రెస్ నాయకులు రూ.20 వేల ఆర్థిక సాయం అందజేశారు. మండలంలోని కిషన్ తండా పరిధిలోని లక్యా తండాలో జరిగిన అగ్ని ప్రమాదంలో గుడిసె దగ్ధమైంది. ఈ నివాసం మేగావత్ పండికు చెందినది. ఈ కార్యక్రమంలోపార్టీ నాయకులు మూడావత్ రాజు, కాముని రవీందర్, మండల కాంగ్రెస్ ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు తార్యా నాయక్, నాయకులు కాట్రోత్ లక్ష్మణ్, చందర్, రవి, తదితరులు పాల్గొన్నారు.

వైద్యారోగ్యశాఖ మంత్రిని కలిసిన డీసీహెచ్


మంత్రిని సన్మానిస్తున్న డీసీహెచ్ చంద్రశేఖర్

మెదక్: వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను మెదక్ జిల్లా కోఆర్డినేటర్ ఫర్ హాస్పిటల్ సర్వీసెస్ (డీసీహెచ్) పీ చంద్రశేఖర్ మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం హైదరాబాద్‌లోని మంత్రి నివాసంలో కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లాలోని ఆస్పత్రుల స్థితిగతుల గురించి దామోదర అడిగినట్లు ఆయన చెప్పారు.

కొత్త పట్టాదారులకు 'రైతు భరోసా'


మాట్లాడుతున్న సంధ్యారాణి

శివ్వంపేట(నర్సాపూర్): కొత్త పట్టా పాస్‌పుస్తకాలు పొందిన రైతులు రైతు భరోసా పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని నర్సాపూర్ ఏడీఏ సంధ్యారాణి అన్నారు. బుధవారం శివ్వంపేటలోని రైతువేదికలో జిల్లా టెక్నికల్ ఏడీఏ వినయ్‌కుమార్‌తో కలిసి ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వ్యవసాయ సిబ్బంది రైతులకు అందుబాటులో ఉంటూ ఆధునిక వ్యవసాయ సాగు విధానం గురించి వివరించాల్సిన బాధ్యత ఉందని అన్నారు. యాసంగి రైతులు సాగు చేయాల్సిన పంటల గురించి వివరించాలని, రసాయన ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ సాగు గురించి అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ లావణ్య, ఏఈఓలు భవాని, మౌనిక, రవి, మజీద్, తదితరులు ఉన్నారు.

టీఆర్‌టీఎఫ్ జిల్లా కమిటీ ఎన్నిక


నూతన సభ్యులను సన్మానిస్తున్న రమేశ్

రామాయంపేట(మెదక్): తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ (టీఆర్‌టీఎఫ్) జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మెంగర్తి ప్రణీద్ కుమార్, జిల్లా ప్రధానకార్యదర్శిగా ఐలయ్య ఎన్నికయ్యారు. బుధవారం రామాయంపేటలో జరిగిన సంఘం జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు కటకం రమేశ్ మాట్లాడారు. ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యల పరిష్కార విషయమై దృష్టి సారించాలని కోరారు. ఆ మేరకు కమిటీతో ప్రమాణ స్వీకారం చేయించారు. జిల్లాలోని పలు మండలాల సంఘం అధ్యక్షులు, కార్యదర్శులు నవీన్ రత్నాకర్, విఠల్, శేఖర్, నర్సింహారావు పాల్గొన్నారు.

యోగా పోటీల్లో విద్యార్థిని ప్రతిభ

జగదేవ్‌పూర్(గజ్వేల్): జాతీయ స్థాయి యోగా పోటీల్లో జగదేవ్‌పూర్ మండలంలోని ఇటిక్యాల ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని నిఖిత సత్తా చాటింది. ఆమె 67వ జాతీయ స్థాయి యోగా పోటీల్లో రాష్ట్రంలో ప్రథమస్థానంలో ప్రతిభ చాటి జాతీయస్థాయికి ఎంపికయింది. నవంబర్ 23 నుంచి 27 వరకు త్రిపురలోని అగర్తలాలో జరిగిన జాతీయస్థాయి యోగా పోటీల్లో రాష్ట్రం తరుపున పాల్గొని ప్రతిభ చాటిందని హెచ్ఎం మాధవరెడ్డి తెలిపారు.


రైల్వేమంత్రికి వినతిపత్రం అందజేస్తున్న ఎంపీ ప్రభాకర్‌రెడ్డి

ఆర్ఓబీ నిర్మించాలి

రైల్వేమంత్రికి కొత్త ప్రభాకర్ వినతి

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రమైన చేగుంట శివారు.. మెదక్ రోడ్డులో ఉన్న రైల్వే గేటు వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని ఆశాఖ కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్‌కు వినతి పత్రం అందించానని ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. బుధవారం తన ఎంపీ పదవికి రాజీనామా చేసేందుకు ఢిల్లీకి వెళ్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా రైల్వే మంత్రిని కలిసి మెదక్ రోడ్డులో ట్రాఫిక్‌ను దృష్టిలో ఉంచుకొని ఎల్సీ నంబర్ 228 వద్ద బ్రిడ్జి నిర్మించాలని కోరినట్లు వివరించారు.

ఎమ్మెల్యేకు సన్మానం


సునీతారెడ్డిని సన్మానిస్తున్న మున్సిపల్ కమిషనర్, సిబ్బంది

నర్సాపూర్: ఎమ్మెల్యే సునీతారెడ్డిని బుధవారం పలువురు నాయకులు, అధికారులు సన్మానించారు. తన స్వగృహంలో మున్సిపల్ కమిషనర్ వెంకట్‌గోపాల్, సిబ్బంది, విద్యుత్ శాఖ అధికారులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువాలతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. పలువురు బీఆర్ఎస్ నాయకులు నయీమొద్దీన్, అశోక్‌గౌడ్, సత్యం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

జోరుగా.. హుషారుగా..

- మహాలక్ష్మి పథకానికి విశేష స్పందన
- ఐదు రోజుల్లో ప్రయాణించిన వారి సంఖ్య 92 వేలు
- జిల్లాలో 462 పల్లెలకు ఉచిత బస్సు సౌకర్యం

రాష్ట్రంలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా మగువలు ఉచితంగా ప్రయాణం చేయవచ్చన్నది మహాలక్ష్మి పథకం ఉద్దేశం. వారం రోజులపాటు ఎలాంటి ఆంక్షలూ ఉండబోవు. ఆ తర్వాత ప్రయాణించాలంటే తప్పనిసరిగా ఆధార్ కార్డు వెంట ఉండాల్సి ఉంటుంది. రద్దీ దృష్ట్యా ఆర్టీసీ యాజమాన్యం స్మార్ట్ కార్డు ప్రవేశపెట్టాలని కూడా యోచిస్తున్నది. ఇదిలా ఉండగా ఉచిత బస్సు ప్రయాణాన్ని మహిళలు, విద్యార్థినులు వినియోగించుకుంటున్నారు. బస్టాండ్ ప్రాంగణాల వద్ద క్యూ, ప్రయాణిస్తున్న బస్సుల్లో రద్దీ కనిపిస్తోంది.

మెదక్: కొలువుదీరిన నూతన కాంగ్రెస్ ప్రభుత్వం ముందుగా మహాలక్ష్మి పథకాన్ని శ్రీకారం చుట్టింది. మహిళలు, విద్యార్థినులంతా ఉచిత బస్సు ప్రయాణాన్ని చేస్తూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు. ఈనెల 8న మధ్యాహ్నం రెండు గంటలకు ప్రారంభం కాగా బుధవారం వరకు అధిక సంఖ్యలో మహిళలు, విద్యార్థినులు ప్రయాణించారు. మెదక్ జిల్లావ్యాప్తంగా 21 మండలాలు ఉండగా 469 గ్రామాలున్నాయి. కాగా జిల్లాలో మెదక్, నర్సాపూర్‌లో రెండు ఆర్టీసీ డిపోలున్నాయి. మెదక్‌లో 99బస్సులు ఉండగా నర్సాపూర్‌లో 35 ఉన్నాయి. వీటిలో ఎక్స్‌ప్రెస్‌లు, పల్లెవెలుగుల్లో ఉచిత ప్రయాణం చేసేందుకు వీలు ఉంది. ఈనెల 9 నుంచి 13వతేదీ సాయంత్రం వరకు సుమారు 92 వేల మంది మహిళలు జిల్లావ్యాప్తంగా ఉచిత ప్రయాణించినట్లు సంబంధిత ఆర్టీసీ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. జిల్లాలో 469 గ్రామాలు ఉండగా 462 గ్రామాలకు ఈ సౌకర్యం ఉన్నట్లు చెబుతున్నారు. ఇందులో ఉదయం, సాయంత్రం వేళలో స్కూల్ విద్యార్థుల కోసం తిరిగే గ్రామాలు అధికంగా ఉన్నాయి. ఈ పథకం వల్ల ఆడపిల్లల చదువుకు ఎంతో ఉపయోగపడుతుందని ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

వీరికి మేలు

మహాలక్ష్మి పథకం విద్యార్థినులకు ఒక గొప్ప వరంగా మారింది. జిల్లావ్యాప్తంగా 894 ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీలు మొత్తం 63 ఉన్నాయి. రోజూ సుమారుగా 20 వేల పైగా విద్యార్థినులు ఉచిత బస్సు సౌకర్యాన్ని వినియోగించుకుంటున్నారు. గతంలో రవాణా ఖర్చుల కోసం విద్యార్థినులకు వారి తల్లిదండ్రులు బస్సుచార్జీలు ఇచ్చే స్థోమత లేక గ్రామీణ ప్రాంతాల్లో బాలికలు చదువును మధ్యలోనే ఆపేసిన సంఘటనలు కోకొల్లలు. ప్రస్తుతం కాంగ్రెస్ సర్కార్ ప్రవేశపెట్టిన ఈ సౌకర్యం మహిళలకు, వీరికి ఎంతో ఉపయోగకరంగా మారింది. కాస్తో కూస్తో ఆర్థికంగా ఉన్నవారి వారి పిల్లలు ఉచిత బస్సు పాస్ తీసినా పల్లెవెలుగు బస్సు పాస్ మాత్రమే అప్పుడు తీసేవారు. ప్రస్తుతం ప్రభుత్వ ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకం కింద ఉచితంగా ప్రయాణిస్తున్నారు.



మెదక్ డిపో వద్ద బస్సు ఎక్కుతున్న మహిళలు

మరిన్ని సర్వీసులు నడిపించాలి



మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఎంతో మేలు జరుగుతోంది. జిల్లాలో బస్సు సౌకర్యం లేని అన్ని గ్రామాలకు కూడా బస్సు సౌకర్యాన్ని కల్పించాలి. విద్యార్థులు బడికి వెళ్లే సమయానికి ఉన్నప్పటికీ సామాన్య ప్రజలకు సౌకర్యంగా మరిన్ని సర్వీసులను నడిపించాలి. – బోయిని అరుణ, మాజీ ఎంపీపీ, చిన్నశంకరంపేట

బోధన మెరుగుకే కాంప్లెక్స్ మీటింగ్‌లు

విద్యాశాఖ రాష్ట్ర పరిశీలకురాలు సునీత

చిన్నశంకరంపేట(మెదక్): ప్రతి విద్యార్థి చదవడం, రాయడం వచ్చేలా తీర్చిదిద్దాలని విద్యా శాఖ రాష్ట్ర పరిశీలకురాలు సునీత ఖన్నా కోరారు. బుధవారం మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాలలో జరిగిన కాంప్లెక్స్ మీటింగ్‌కు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల బోధనను మెరుగు పర్చుకునేందుకే కాంప్లెక్స్ మీటింగులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు సులభంగా అర్థం అయ్యేలా బోధన ఉండాలని సూచించారు. ముఖ్యంగా వారు చదువుల పట్ల ఆకర్షణీయంగా బోధన చేసినప్పుడే సత్ఫలితాలు వస్తాయన్నారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్ఎం దీప్లారాథోడ్, ఆర్పీలు సత్యనారాయణ, చల్ల లక్ష్మణ్ ఉన్నారు.


మాట్లాడుతున్న సునీత ఖన్నా

దొరికిన సెల్‌ఫోన్ కలెక్టర్‌కు అప్పగింత


శ్రీధర్‌ను సన్మానిస్తున్న కలెక్టర్ రాజర్షిషా

విద్యార్థి శ్రీధర్‌ను సన్మానించిన రాజర్షిషా

మెదక్ కలెక్టరేట్: దొరికిన సెల్‌ఫోన్‌ను ఓ విద్యార్థి కలెక్టర్‌కు అప్పజెప్పిన ఉదంతం పట్టణంలో ఆలస్యంగా వెలుగుచూసింది. వివరాలిలా ఉన్నాయి.. ప్రభుత్వ డిగ్రీ కళాశాల బీఎస్సీ విద్యార్థి శ్రీధర్ నవంబర్ 23న పట్టణంలోని ఎస్టీ బాయ్స్ హాస్టల్ వద్ద స్మార్ట్ ఫోన్ దొరికింది. పలు మార్లు కలెక్టరేట్‌కు రాగా కలెక్టర్ అందుబాటు లేరు. దీంతో బుధవారం మరోసారి వచ్చి రాజర్షిషాను కలిసి సెల్‌ఫోన్‌ను అందజేశాడు. స్పందించిన ఆయన విద్యార్థిని అభినందించి సన్మానించారు. శ్రీధర్‌ను తోటి విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని పేర్కొన్నారు. పోలీస్ అధికారులకు అందజేసి బాధితులకు అందజేయాలని ఆదేశించారు.

కార్యకర్తలకు అండగా ఉంటా

మాజీ మంత్రి ఈటల రాజేందర్

తూప్రాన్: బీజేపీ నాయకులకు,కార్యకర్తలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని మాజీ మంత్రి ఈటల రాజేందర్ భరోసా ఇచ్చారు. బుధవారం గజ్వేల్ నియోజకవర్గం తూప్రాన్ ఉమ్మడి మండలం మనోహరాబాద్, తూప్రాన్ మండలాల నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గజ్వేల్ నియోజకవర్గంలో జరిగిన ఎన్నికల్లో కేసీఆర్‌కు ముచ్చెమటలు పట్టించిన ఘనత బీజేపీ కార్యకర్తలదేనన్నారు. రానున్న ఎన్నికల్లో స్థానిక సంస్థల నుంచి పార్లమెంట్ ఎన్నికల వరకు కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో తూప్రాన్ ఉమ్మడి మండలంలో బీజేపీకి భారీగా ఓట్లు వచ్చాయని తెలిపారు. ఈ సమావేశానికి మున్సిపల్ శాఖ అధ్యక్షుడు రామునిగారి మహేష్ గౌడ్ అధ్యక్షత వహించారు. సమావేశంలో గజ్వేల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, సర్పంచ్‌ల ఫోరం ఉపాధ్యక్షుడు కాళ్లకల్ సర్పంచ్ నత్తి మల్లేశ్, అసెంబ్లీ కన్వీనర్ సాయి, మండల అధ్యక్షుడు మహేశ్ యాదవ్, జిల్లా నాయకులు నర్సోజి, తాటి విట్టల్, మనోహరాబాద్ మండల అధ్యక్షుడు నరేందర్ చారి,చంద్రశేఖర్, ఐలయ్య యాదవ్, అజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రాజేందర్

అంకితభావంతో అందలం


డీఈఓని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

జిల్లా విద్యాశాఖ అధికారి రాధాకిషన్

శివ్వంపేట(నర్సాపూర్): విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యతను వెలికి తీసుకు రావాల్సిన బాధ్యత ప్రతి ఉపాధ్యాయుడిపై ఉందని జిల్లా విద్యాశాఖ అధికారి రాధాకిషన్ అన్నారు. బుధవారం శివ్వంపేట ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కాంప్లెక్స్ సమావేశంలో ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ప్రతి విద్యార్థికీ చదవడం, రాయడం, మంచి పదాలతో మాట్లాడటం రావాలన్నారు. అంకిత భావంతో విధులు నిర్వహించి ఉత్తమ ఫలితాలు వచ్చేలా కృషి చేయాలన్నారు. ఇటీవల ఢిల్లీలో జరిగిన విద్యావిధానం-మార్పులు, అభివృద్ధి అంశంపై జాతీయస్థాయి సమావేశంలో ప్రసంగించిన డీఈఓను మండల ఉపాధ్యాయుల బృందం సన్మానించింది. కార్యక్రమంలో హెచ్ఎం బాలచంద్రం, సుదర్శన మూర్తి, సునంద, రవీందర్ తదితరులు ఉన్నారు.

20న గ్రహణ మొర్రి స్క్రీనింగ్ క్యాంప్

మెదక్ కలెక్టరేట్: అవసరమైన ప్రజలు ఉచిత గ్రహణ మొర్రి స్క్రీనింగ్ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా విద్యాధికారి రాధా కిషన్ బుధవారం పిలుపునిచ్చారు. ఈనెల 20న మెదక్ ఎమ్మార్సీ నందు ఈ క్యాంపు నిర్వహిస్తున్నామని తెలిపారు. బసవతారకం స్మైల్ ట్రెన్ సెంటర్-బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్, డాక్టర్ ముకుంద రెడ్డి ఆధ్వర్యంలో ఉచిత గ్రహణ మొర్రి స్క్రీనింగ్ ఉంటుందని తెలిపారు. 6 నెలల వయసు నుంచి 50 ఏళ్ల వారు ఈ శిబిరంలో హాజరు కావచ్చని తెలిపారు. ఈ ఆపరేషన్ అవసరం ఉన్నవారు, ఆపరేషన్ చేయించుకున్న వారు సైతం హాజరు కావచ్చని తెలిపారు. పూర్తి సమాచారం కోసం 96529-19098, 97010-45253, 9666262652 నంబర్లలో సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

గంగమ్మకు హారతి

దుబ్బాక: కార్తీక పౌర్ణమి, మార్గశిర శుద్ధ పాడ్యమిని పురస్కరించుకుని మహిళలు పోలి స్వర్గం పూజలను వైభవంగా నిర్వహించారు. పట్టణంలోని పెద్ద చెరువు వద్ద గంగమ్మకు హారతులిచ్చి చెరువులో దీపాలను వదిలి కార్తీక మాస వ్రత దీక్షను పూర్తిచేసుకున్నారు. అర్చకుడు రాంబాబు భార్గవ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.


గంగమ్మకు హారతి నిర్వహిస్తున్న మహిళలు

పశుగణాభివృద్ధికే కృత్రిమ గర్భధారణ

జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ ఈఓ కొండల్‌రెడ్డి

చిలప్‌చెడ్(నర్సాపూర్): కృత్రిమ గర్భధారణతో పశుజాతి అభివృద్ధి చెందుతుందని, మేలైన జీవాలను ఎంపిక చేసుకునేందుకు అవకాశం ఉంటుందని జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ ఈఓ కొండల్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని గుజిరి తండాలో పశు సంవర్ధక శాఖ సహకారంతో ఉచిత పశువైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పాడి పశువుల్లో అత్యున్నత జన్యు లక్షణాలు కలిగిన దున్నల నుంచి వీర్యాన్ని సేకరిస్తామని చెప్పారు. దానిని ఆడ పశువుల గర్భధారణకు ఉపయోగిస్తామని వెల్లడించారు. తండాలో పలు రైతులకు చెందిన గేదెలకు గర్భధారణ కార్యక్రమం చేపట్టామని వివరించారు. అలాగే సూడి కట్టిన గేదెల పాల ఉత్పత్తికి మందులు పంపిణీ చేశామని తెలిపారు. తండాలోని మరో 120 పశువులకు, 390 జీవాలకు సైతం వివిధ రకాల వ్యాధులకు సైతం మందులు అందజేశామన్నారు. ఇలాంటి వైద్యశిబిరాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ రాకేశ్ నాయక్, పశువైద్యుడు వినోద్ రాజు, గోపాలమిత్ర సూపర్‌వైజర్ శ్రీనివాస్‌రెడ్డి, వెటర్నరీ అసిస్టెంట్ సురేశ్, సిబ్బంది శంకర్, అరవింద్, రైతులు తదితరులు పాల్గొన్నారు.


గేదెకు చికిత్స అందజేస్తున్న కొండల్‌రెడ్డి

మాది ప్రజాపక్షం

- నర్సాపూర్‌లో హ్యాట్రిక్ విజయం సాధించాం
- పార్లమెంట్ ఎన్నికల్లోనూ రెట్టింపు ఉత్సాహంతో పనిచేయాలి
- పార్టీ శ్రేణులకు మాజీ మంత్రి హరీశ్‌రావు పిలుపు



సభలో మాట్లాడుతున్న హరీశ్‌రావు, పక్కన ఎమ్మెల్యే సునీతారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

నర్సాపూర్: తాము ఏ పక్షమైనా ప్రజల కోసమే పని చేస్తామని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు చెప్పారు. బుధవారం నర్సాపూర్‌లో ఏర్పాటు చేసిన కృతజ్ఞత సభకు ఎమ్మెల్యే సునీతా రెడ్డి అధ్యక్షత వహించగా ఆయన మాట్లాడారు. ప్రతిపక్షమైతే ప్రజల కోసం పని చేస్తామని వివరించారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ నాయకుల పనితనం త్వరలోనే బయటపడుతుందని చెప్పారు. ప్రత్యేక తెలంగాణ సాధించిన అనంతరం సీఎంగా కేసీఆర్ బాధ్యతలు చేపట్టి రాష్ట్రంలో 33 జిల్లాలు ఏర్పాటు చేశారని గుర్తుచేశారు. హామీ మేరకు మెదక్‌ను జిల్లా కేంద్రం చేశారన్నారు. పలు మండల కేంద్రాలు ఏర్పాటు చేశారని, ప్రజల ఆకాంక్షల మేరకు అభివృద్ధి చేశారని ఉద్ఘాటించారు. తమ హయాంలో ఐటీ, పారిశ్రామిక రంగాలు గణనీయంగా అభివృద్ధిని సాధించాయన్నారు. రాష్ట్రంలో అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. పార్టీ ప్రతిపక్షంలో ఉందని నాయకులు, కార్యకర్తలు అధైర్య పడొద్దని ధైర్యం ఇచ్చారు. తనతోపాటు స్థానిక నాయకులు అండగా ఉంటామని భరోసానిచ్చారు. తాను తమ వెన్నంటి ఉంటానని, ఒక్క ఫోన్ చేస్తే గంటలో నర్సాపూర్‌కు చేరుకుంటానని కార్యకర్తలకు స్పష్టం చేశారు. ఈ నియోజకవర్గంలో నాయకులు సమన్వయంతో పని చేసి నర్సాపూర్ సీటు గెలుచుకునేందుకు చేసిన కృషి అభినందనీయమన్నారు. ఈ విజయంతో నర్సాపూర్‌లో బీఆర్ఎస్ హ్యాట్రిక్ సాధించిందన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు, పార్లమెంటు ఎన్నికల్లో సైతం ఇదే ఉత్సాహంతో పని చేస్తే విజయం తథ్యమని పేర్కొన్నారు.

ఎమ్మెల్యే సునీతారెడ్డి మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్ నేతలు కుమ్మక్కు అయ్యాయని ఆరోపించారు. కానీ బీఆర్ఎస్ విజయాన్ని అడ్డుకోలేకపోయారని చెప్పారు. నిరంతరం పరిస్థితిని హరీశ్‌రావు సమీక్షించడంతో పాటు సలహాలతో అందరినీ ఉత్సాహపరిచారన్నారు. ఎన్నికల ఇన్‌చార్జ్ ఎమ్మెల్సీ వెంకట్రామ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి సైతం తన విజయం కోసం కృషి చేశారని తెలిపారు. పార్టీ నాయకులు, గాలిఅనిల్ కుమార్, గోపి తదితరులు సైతం కష్టపడి పని చేశారని వెల్లడించారు. కాంగ్రెస్ ప్రభుత్వం హామీలు అమలు చేయకపోయినా, వారు తప్పులు చేసినా వేలెత్తి చూపుతామని చెప్పారు. ముందుగా హరీశ్‌రావును సునీతారెడ్డి, పలువురు నాయకులు శాలువాలు, పూలకుండీలతో ఘనంగా సన్మానించారు. సభలో సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, జెడ్పీ చైర్‌పర్సన్ హేమలత, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, కేసీఆర్ సేవాదల్ రాష్ట్ర అధ్యక్షుడు జావెద్‌పటేల్, మాజీ చైర్మన్లు దేవేందర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రాగౌడ్, పార్టీ నాయకులు గాలిఅనిల్‌కుమార్, సింగాయిపల్లి గోపి, బబియానాయక్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

రాష్ట్రస్థాయికి ఎంపిక


నాగేందర్‌గౌడ్‌తో కళాశాల సిబ్బంది

దుబ్బాక : స్కూల్ ఫెడరేషన్ అండర్–19 రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు దుబ్బాక ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన చేపూరి నాగేందర్ గౌడ్ ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ లక్ష్మీ నారాయణ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. విద్యార్థులకు క్రీడల్లో శిక్షణ ఇస్తున్న కళాశాల సిబ్బంది సాంబశివ రావును ప్రత్యేకంగా అభినందించారు.

మోడల్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులతో ప్రిన్సిపాల్ భాస్కర్‌రెడ్డి

మునిపల్లి(అందోల్):మునిపల్లి మోడల్ స్కూల్ విద్యార్థులు అండర్–17 బాల బాలికల రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో పాల్గొన్నట్లు మునిపల్లి మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ భాస్కర్ రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన విద్యార్థులతో కలిసి మాట్లాడారు. మహబూబ్ నగర్ జిల్లా జడ్చర్ల మండలం బాదేపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో ఈ నెల 8,9,10 తేదీల్లో రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ టోర్నమెంట్ జరిగిందన్నారు. ఇందులో మునిపల్లి మోడల్ స్కూల్ నుంచి వర్షిత, వందశ్రీ, అమూల్య, ప్రవంతి, ధీరజా, బాలురు అఖిల్ పాల్గొన్నట్లు తెలిపారు. విద్యార్థులను, పీడీ మన్సూర్ అహ్మద్‌ను ప్రిన్సిపాల్ అభినందించారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల పరిశీలకుడిగా గోవర్ధన్‌రెడ్డి



గజ్వేల్‌రూరల్: రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల పరిశీలకుడిగా గోవర్ధన్‌రెడ్డి ఎంపికయ్యారు. ఈనెల 13 నుంచి 15 వరకు ఎస్‌జీఎఫ్ (స్కూల్ గేమ్స్ ఫెడరేషన్) ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్ జిల్లాలోని నారాయణరావుపేటలో అండర్–14 బాలబాలికల విభాగంలో రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలు జరుగనున్నాయి. గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీఈటీగా విధులు నిర్వహిస్తున్న గోవర్ధన్ రెడ్డి రాష్ట్రస్థాయి పోటీల్లో బాలికల విభాగానికి పరిశీలకుడిగా వ్యవహరిస్తున్నారు.

రేపు మెదక్‌లో ర్యాలీ

మెదక్ కలెక్టరేట్: ఈనెల 15న జిల్లాస్థాయిలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు జిల్లా స్త్రీ, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ అధికారి బ్రహ్మాజి బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా మెదక్ జిల్లా కేంద్రంలోని ధ్యాన్‌చంద్ చౌరస్తా నుంచి ఇందిరాగాంధీ స్టేడియం వరకు ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు.

టైలరింగ్‌లో ఉచిత శిక్షణ

గజ్వేల్‌రూరల్: గ్రామీణ మహిళలు, నిరుద్యోగ యువతులకు టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్‌లో 30 రోజుల పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ డైరెక్టర్ రాజలింగం బుధవారం తెలిపారు. గజ్వేల్, ములుగు, వర్గల్ మండలాల పరిధిలోని ఆయా గ్రామాలకు చెందిన 18 నుంచి 45 ఏళ్ల మధ్య వయస్సు కలిగి, 10 వ తరగతి చదివిన వారు అర్హులన్నారు. శిక్షణ కాలంలో ఉచిత యూనిఫామ్, కోర్సు మెటీరియల్‌తో పాటు టీ, భోజన సదుపాయం, టూల్ కిట్స్ అందిస్తామన్నారు. శిక్షణ అనంతరం కేంద్ర గ్రామీణ అభివృద్ధి మంత్రిత్వ శాఖ నుంచి స్కిల్ ఇండియా వారి సర్టిఫికెట్‌తో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సబ్సిడీ రుణాలకు సహకరించడం జరుగుతుందన్నారు. గజ్వేల్ పట్టణంలోని ఐఓసీ (ఇంటిగ్రేటెడ్ ఆఫీస్ కాంప్లెక్స్)లో ఈనెల 18 నుంచి శిక్షణ ప్రారంభమవుతుందన్నారు. ఆసక్తిగలవారు ఈనెల 15వ తేదీలోగా 99498 82026 నంబరుకు ఫోన్‌చేసి తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

బట్వాడాకు బ్రేక్



గ్రామీణ తపాలా ఉద్యోగులు (జీడీఎస్) తమ డిమాండ్ల సాధన కోసం సమ్మె బాట పట్టారు. దీంతో జిల్లా వ్యాప్తంగా తపాలా బట్వాడా సేవలు నిలిచాయి. సమ్మె గురించి గతంలోనే సంబంధిత ఉన్నతాధికారులకు వినతిపత్రాలు సమర్పించినట్లు ఉద్యోగులు పేర్కొంటున్నారు. హామీలు పూర్తిస్థాయిలో అమలుకు నోచుకోకపోవడంతో తిరిగి సమ్మెకు దిగారు. ముఖ్యంగా ఈ మారు కమలేష్ చందర్ కమిటీ సిఫారసు అంశాలను పూర్తిస్థాయిలో అమలు చేయాలన్న తదితర డిమాండ్లు వినిపిస్తున్నాయి. జీడీఎస్‌లు చేపడుతున్న సమ్మెతో ఉపాధి హామీ కూలీలకు చెల్లింపులు, ఉత్తరాల బట్వాడా, డిపాజిట్లు, విత్‌డ్రాలు, సుకన్య సమృద్ధి యోజన లాంటి సేవలకు అంతరాయం ఏర్పడింది.

– నారాయణఖేడ్

సమ్మె బాటలో తపాలా ఉద్యోగులు
- నిలిచిన పోస్టాఫీస్ సేవలు
- జిల్లా వ్యాప్తంగా కొనసాగుతున్న నిరసనలు
- సమస్యల పరిష్కారం కోసం పోరుబాట





సమ్మె చేస్తున్న తపాలా ఉద్యోగులు

జిల్లాలో సంగారెడ్డి, జహీరాబాద్, రామచంద్రాపురంలో ప్రధాన తపాలా కార్యాలయాలతోపాటు, సబ్ పోస్టాఫీసులు, శాఖ తపాలా కార్యాలయాలు 275 కార్యాలయాలు ఉన్నాయి. ఇందులో 80 మంది వరకు ప్రభుత్వ ఉద్యోగులు ఉండగా బీపీఎం, ఏబీపీఎం, డాక్ సేవక్, జీడీఎస్‌లు 400 మందికి పైగా ఉన్నారు. వీరందరూ ఏళ్ల తరబడి పనిచేస్తున్నప్పటికీ రూ.16 వేల వేతనంతోనే సరిపుచ్చుకుంటున్నారు. వీరి సమస్యలను పరిష్కరించే విషయంలో త్వరలో అమలు చేస్తామని గతంలో ప్రభుత్వ వర్గాలు యూనియన్ నాయకులతో ఒప్పందం కుదిర్చినప్పటికీ ఇప్పటికీ అమలుకు నోచుకోలేదని పేర్కొంటున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో సమ్మెకు పూనుకున్నామని ఉద్యోగులు అంటున్నారు. తక్షణమే నివేదికలోని తమ న్యాయమైన అంశాలను ఆమోదించి తమ సమస్యలను పరిష్కరించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. జీడీఎస్‌ల ద్వారా దేశ వ్యాప్తంగా తపాలాశాఖకు 80 శాతంపైగా లాభాలను ఆర్జించి పెడుతున్నప్పటికీ తమ సమస్యల పరిష్కారంలో, ఇచ్చిన హామీల అమలులో వివక్ష చూపుతోందని జీడీఎస్ ఉద్యోగులు అంటున్నారు.

ఉద్యోగుల సమస్యలు..

- ఉద్యోగులకు ప్రభుత్వపరంగా ఆరోగ్య సదుపాయం లేదు. 65 సంవత్సరాలు వస్సులో ఉద్యోగ విరమణ అనంతరం శాఖాపరంగా ఎలాంటి పింఛన్ సదుపాయం ఉండదు.
- సెలవులు లేకపోగా అత్యవసర పనులకు వెళ్లాల్సి వస్తే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకొని వెళ్లాల్సిందే. ఒక్కో బీపీఎం రూ.లక్షల్లో ఆసరా, ఉపాధి కూలీ చెల్లింపులు, ఇతర డిపాజిట్ల రూపేనా సొంత రక్షణ చేపట్టుకోవాల్సిందే.
- దురదృష్టవశాత్తు అనుకోని విపత్తు జరిగినా సదరు ఉద్యోగే బాధ్యత వహించాల్సి ఉంటుంది. ప్రతిభ ఆధారంగానే ఉద్యోగ నియామక ప్రక్రియ చేపడుతున్నప్పటికీ ఉద్యోగ భద్రత, వేతనం ఇతర సదుపాయాలు ఆ స్థాయిలో ఉండటంలేదు.

ఇవీ డిమాండ్లు..

- ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా కుటుంబసభ్యులకు కార్పొరేట్ వైద్య సదుపాయం కల్పించాలి. కమలేష్ చంద్ర వేతన కమిటీ సిఫార్సులను పూర్తి స్థాయిలో అమలు చేయాలి.
- ఉద్యోగ విరమణ ప్యాకేజీ రూ.5లక్షలు చెల్లించాలి. జీడీఎస్‌లకు 8గంటల పనికల్పించి సివిల్ సర్వెంట్ హోదా ఇవ్వాలి. కనీస వేతనంతోపాటు 12, 24, 36 సంవత్సరాల సీనియార్టీ ప్రకారం వేతనాలు చెల్లించాలి.
- ఫిట్‌మెంట్ మార్చడంతోపాటు పూర్తిస్థాయి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి. టార్గెట్ల పేర ఉన్నతోద్యోగుల మానసిక వేధింపులు, వేతనాల నిలుపుదల, వాట్సప్ ద్వారా పగలు, రాత్రి బెదిరింపులు ఆపివేయాలి.
- ఎన్ఆర్ఈజీఎస్, ఆర్‌పీఎల్ఐ, పీఎల్ఐ, ఐపీపీబీ మొదలగు స్కీంలను వర్క్‌లోడ్‌లోకి తీసుకోవాలి. గ్రూపు ఇన్సూరెన్స్ రూ.5 లక్షలకు పెంచాలి.
- ఎస్‌డీబీఎస్‌కు జీడీఎస్ కాంట్రిబ్యూషన్ 10 శాతం, డిపార్ట్‌మెంట్ కాంట్రిబ్యూషన్ 10 శాతం ఇవ్వాలి.

సమస్యలు పరిష్కరించాలి



తమ న్యాయమైన డిమాండ్లను తక్షణం పరిష్కరించాలి. 8 గంటల పని విధానం అమలు చేస్తూ పెన్షన్‌తోపాటు అన్ని ప్రయోజనాలను మంజూరు చేయాలి. గ్రూప్ ఇన్సూరెన్స్ రూ.5 లక్షలకు గ్రాట్యూటీ రూ.5 లక్షలకు పెంచాలి. పెయిడ్ లీవ్‌ను 180 రోజుల వరకు దాచుకొని నగదుగా మార్చుకొనే సౌకర్యం కల్పించాలి. జీడీఎస్‌లు, కుటుంబ సభ్యులకు వైద్య సౌకర్యం కల్పించాలి.

– నర్సారెడ్డి, డాక్‌సేవక్, ఖేడ్ సబ్ పోస్టాఫీస్

డిమాండ్లు తీర్చాలి



తపాలా శాఖలో దశాబ్దాలుగా చాలీచాలని వేతనాలతో ఉద్యోగం చేస్తున్నాం. మా సమస్యలను వెంటనే పరిష్కరించాలి. కమలేష్ చందర్ సిఫార్సులను అమలు చేయాలి. తమకు ఉద్యోగ భద్రత కల్పించడంతోపాటు పింఛన్ సదుపాయం కల్పించాలి. సీనియార్టీ ప్రకారం అర్హులైన వారికి పదోన్నతులు కల్పించాలి. సమస్యలు పరిష్కారం అయ్యేవరకు సమ్మె కొనసాగుతుంది.

– శిరోమణి, యూనియన్ జిల్లా అధ్యక్షుడు



నీటిని బయటకు పంపిస్తున్న మహిళా రైతు, కోయడానికి వీలు లేకుండా ఉన్న వరి పంట

కష్టాల్లో ముంచేను

- కోత దశలో చెరువుల నీరు వరి పొలాల్లోకి..
- కోయడానికి వీలు లేకుండా పంట
- లబోదిబోమంటున్న రైతులు


పొలాలకు వెళ్తున్న దుద్దె చెరువు నీళ్లు

కొండపాక(గజ్వేల్): అధికారుల అలసత్వం, ప్రజా ప్రతినిధుల ఉదాసీనతల మూలంగా కోత దశకు చేరిన వరి పంట పొలాల్లోనే ఉండిపోతోంది. ఈ హృదయ విదారకర ఘటన కుకునూరుపల్లి మండలంలోని మంగోల్ గ్రామంలో కనిపిస్తోంది. వివరాల్లోకి వెళ్తే.. మల్లన్న సాగర్ నుంచి మంగోల్ శివారులో నిర్మించిన 540 ఎల్ఎండీ వాటర్ ట్రీట్ మెంట్ ప్లాంట్‌కు నీటి పంపింగ్ జరుగుతోంది. వాటర్‌ను శుద్ధి చేయడంలో వృథాగా పోయే నీటిని గ్రామంలోని దుద్దె చెరువులోకి పంపిస్తున్నారు. దీంతో నెల రోజులుగా చెరువు అలుగు పారుతోంది. చెరువు కట్ట కింద నుంచి నీరంతా జాలుగా వెళ్తూ వరి చేనులోకి చేరుతుంది. దీంతో పంట కోయలేకపోతున్నామంటూ అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నల్లచెరువుకు గండి..

కూలీల కొరతకు తోడు నీరు నిల్వ ఉండడంతో చైన్ మిషన్‌తో హార్వెస్టింగ్ చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయంటూ రైతులు వాపోతున్నారు. మరో చోట ఉన్న నల్లచెరువుకు గండి పడి నీరంతా పొల్లాలో నుంచే బయటకు వెళ్తుంది. గండి పడిన విషయాన్ని ఇరిగేషన్ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. రెండు చెరువు కింద సుమారు 80 ఎకరాల వరి పంట కోతకు సిద్ధంగా ఉంది. చైన్ మిషన్‌ల కొరత మూలంగా గంటకు సుమారు రూ.3,500 ధరను చెల్లిసే గాని హార్వెస్టింగ్ చేయమంటు నిర్వాహకులు చెబుతున్నారు. పంటను సాగు చేయగా వచ్చే దిగుబడి పెట్టుబడులకు సరిపోవడం లేదంటూ అన్నదాతలు వాపోతున్నారు.

గండితో చెరువు నీరంతా వృథాగా పోయి యాసంగి పంటకు నీటి కొరత ఏర్పడే ప్రమాదం ఉందంటూ రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి చెరువుల నుంచి నీళ్లు పొలాల్లోకి రాకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.

మూడు ఏటీఎంలలో చోరీ

- గ్యాస్ కట్టర్లతో పగులగొట్టి రూ.28 లక్షలు అపహరణ


ధ్వంసమైన ఏటీఎం

సదాశివపేట (సంగారెడ్డి): సంగారెడ్డి జిల్లా సదాశివపేటలో వేర్వేరు చోట్ల ఏర్పాటు చేసిన మూడు ఏటీఎంలలో మంగళవారం అర్ధరాత్రి దొంగలు చోరీకి పాల్పడ్డారు. మొత్తం రూ.28లక్షల నగదును అపహరించారు. వివరాలు.. పట్టణంలోని తిలక్‌రోడ్డులోగల బసవేశ్వర మందిరం, గాంధీచౌక్, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల సమీపంలోని ఎస్‌బీఐకి చెందిన మూడు ఏటీఎంలలో దొంగలు చొరబడ్డారు. ముందుగా సీసీ కెమెరాలకు వైట్‌నర్ పూశారు. అనంతరం షట్టర్‌ల తాళాలు పగులగొట్టి, గ్యాస్‌కట్టర్‌లతో ఏటీఎంలను పగులగొట్టారు. వాటిలో ఉన్న డబ్బు లను అపహరించారు. మూడు ఏటీఎంలలో వేర్వేరుగా చోరీకి పాల్పడ్డారా..? లేదా అనే విషయం పోలీసులకు అంతుచిక్కడం లేదు. పోలీసులు చుట్టుపక్కల ఉన్న ఏటీఎంలను పరిశీలిస్తున్నారు. ఒక్క ఏటీఎం కేంద్రంలో దొంగతనం చేయడమే అసాధారణమని, అలాంటిది ఏకంగా మూడు ఏటీఎంలు చోరీకి గురికావడం విస్మయం కలిగిస్తుంది. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ నవీన్‌కుమార్ తెలిపారు.

పంటల పరిశోధనపై ఒప్పందం


ఒప్పంద పత్రాలను చూపుతున్న అధికారులు

ములుగు(గజ్వేల్) : ములుగు కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం (ఎస్‌కేఎల్‌టీఎస్‌హెచ్‌యూ) హైదరాబాద్‌కు చెందిన అర్బన్ కిషాన్ ఫామ్స్ ప్రైవేట్ లిమిటెడ్‌ల మధ్య బుధవారం పరస్పర సహకార ఒప్పందం కుదుర్చుకున్నారు. ములుగు విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ డాక్.బీ నీరజప్రభాకర్, అర్బన్ కిషాన్ ఫామ్స్ ప్రతినిధి డాక్టర్.సాయిరెడ్డి ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ.. చిల్లి, చెర్రీ , టమాట పంటల పరిశోధనల అభివృద్ధిపై దృష్టి సారించడంతోపాటు విశ్వవిద్యాలయంలో కొనసాగుతున్న ధ్యానపు పంటల పరిశోధనల సమాచారాన్ని పంచుకుంటూ సహాయ సహకారాలు అందించుకోవడమే ఈ ఒప్పందం యొక్క ముఖ్య ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ అధికారులు భగవాన్, కిరణ్‌కుమార్, రాజశేఖర్, విజయ, శ్రీనివాస్, నర్సిరెడ్డి, విహారీ, సంపత్, తదితరులు పాల్గొన్నారు.

ఫోర్జరీ కేసులో ఇద్దరి రిమాండ్

పటాన్‌చెరుటౌన్ : ఫోర్జరీ, మోసం కేసులో ఇద్దరిని రిమాండ్‌కు తరలించిన ఘటన బీడీఎల్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. సీఐ రవీందర్ రెడ్డి కథనం ప్రకారం.. పటాన్‌చెరు మండలం పాశమైలారం పారిశ్రామిక వాడలోని సెన్సా కోర్ వైద్య పరీక్షల పరికరాల తయారీ పరిశ్రమలో పవన్ చంద్ర నాగూర్ కమర్షియల్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నాడు. ఇతడు నష్టం కల్గించే విధంగా మోసం, ఫోర్జరీ నేరాలకు పాల్పడడంతో యాజమాన్యం 2022 జూలైలో పోలీసులకు ఫిర్యాదు చేసింది. అప్పుడు నిందితుడు పవన్ చంద్ర నాగూర్ స్టేషన్ బెయిల్ తీసుకున్నాడు. కేసు విచారణ కొనసాగుతుండగా నాగూర్ మోసం, ఫోర్జరీ నేరాలు పాల్పడినట్లు తేలింది. దీంతో బీడీఎల్ పోలీసులు పలు సెక్షన్‌ల కింద కేసు నమోదు చేశారు. అతడితోపాటు, పరిశ్రమలో పనిచేసిన వరప్రసాద్ సహకరించడంతో మంగళవారం ఇద్దరిని అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించారు.

బైక్‌పై నుంచి పడి వ్యక్తి మృతి


లక్ష్మీపతి (ఫైల్)

రామాయంపేట (మెదక్): బైక్‌పై నుంచి పడి వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని ప్రగతి ధర్మారం వద్ద మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. ప్రగతి ధర్మారం గ్రామానికి చెందిన చౌకి లక్ష్మీపతి (45) రాత్రి పులిమామిడి నుంచి బైక్‌పై ధర్మారం వస్తున్నాడు. ఈ క్రమంలో బైక్ అదుపుతప్పి పడిపోవడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు.

17న ఉమ్మడి జిల్లా జట్ల ఎంపిక



మిరుదొడ్డి(దుబ్బాక): మెదక్ జిల్లా బాల్ బాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 17వ తేదీన సీనియర్ బాల్ బాడ్మింటన్ (బాల, బాలికలు) ఉమ్మడి జిల్లా జట్ల ఎంపిక చేయనున్నట్లు మెదక్ జిల్లా బాల్ బాడ్మింటన్ వర్కింగ్ ప్రెసిడెంట్ గొట్టం భైరయ్య, జనరల్ సెక్రెటరీ పీవీ. రమణ తెలిపారు. బుధవారం మిరుదొడ్డిలో వారు మాట్లాడుతూ.. ఆదివారం రోజున బీహెచ్ఈఎల్ రామచంద్రాపురంలోని సంకల్ప్ వెల్ఫేర్ అసోసియేషన్ ఓల్డ్ ఎంబీజీ గ్రౌండ్‌లో మధ్యాహ్నం 3 గంటలకు ఎంపిక ఉంటుందన్నారు. ఆసక్తి గల ఉమ్మడి జిల్లాకు చెందిన క్రీడాకారులు 3 పాస్ పోర్టు సైజు ఫొటోలతోపాటు, ఆధార్ కార్డు జీరాక్స్ కాపీని వెంట తెచ్చుకోవాలని సూచించారు. ఎంపికైన క్రీడా జట్లు ఈ నెల 22 నుంచి 24 వరకు నిర్వహించే 69వ సీనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ బాల్ బాడ్మింటన్ ఛాంపియన్ షిప్‌లో పాల్గొంటారని వెల్లడించారు. మరిన్ని 94407 03038, 97047 46511 నంబర్లను సంప్రదించాలని కోరారు.

ఏసీబీ అధికారుల నంబర్లూ పెట్టండి

అదనపు కలెక్టర్‌ను కోరిన సీసీఆర్ బృందం


శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రాన్ని అందిస్తున్న బృందం సభ్యులు

సిద్దిపేటరూరల్: జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఆర్‌టీఐ బోర్డులతోపాటుగా ఏసీబీ అధికారుల ఫోన్ నంబర్లతో కూడిన బోర్డులను ఏర్పాటు చేయాలని కోరుతూ బుధవారం కౌన్సిల్ ఫర్ సిటిజన్ రైట్స్ ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా సీసీఆర్ జిల్లా అధ్యక్షుడు గుండ్ల శివచంద్రం, మీడియా స్టేట్ కోఆర్డినేటర్ సాజిద్ మాట్లాడుతూ.. పారదర్శక పాలన కోసం సీసీఆర్ సంస్థ పాటుపడుతుందన్నారు. సీసీఆర్ జాతీయ కమిటీ ఆదేశాల మేరకు ప్రతీ ప్రభుత్వ కార్యాలయంలో ఏసీబీ అధికారుల ఫోన్ నంబర్లు ఏర్పాటు చేయాలని కోరుతూ వినతిపత్రాలను అందించామన్నారు. సానుకూలంగా స్పందించిన అదనపు కలెక్టర్ వెంటనే అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారన్నారు. కార్యక్రమంలో సీసీఆర్ సభ్యులు శివ, ఫారూఖ్ అలీ, శ్రీనివాస్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో ఆటో డ్రైవర్ మృతి

- ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణంతో మనోవేదన


పెంద్యాల సారయ్య

అక్కన్నపేట (హుస్నాబాద్): హోటల్ వద్ద టీ తాగడానికి వెళ్లిన ఓ ఆటో డ్రైవర్ ఒక్కసారిగా కుప్పకూలి గుండెపోటుతో మృతి చెందాడు. ఈ ఘటన సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం గోవర్ధనగిరిలో బుధవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన పెంద్యాల సారయ్య(50) ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల ప్రభుత్వం ఆర్టీసీ బస్సులో మహిళలకు ఉచితం అంటూ ప్రవేశ పెట్టడం, ఆర్థికంగా ఇబ్బందులు ఎక్కువగా ఉండడంతో ఒత్తిడికి లోనయ్యాడు. దీంతో గుండెపోటుకు గురయ్యాడని గ్రామస్థులు చెబుతున్నారు. మృతుడికి భార్య ఎల్లవ్వ, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

ద్విచక్ర వాహనం, కారు ఢీ

- ఒకరు మృతి, నలుగురికి తప్పిన ప్రమాదం


నర్సయ్య మృతదేహం

వట్‌పల్లి(అందోల్): ద్విచక్ర (ఎక్సెల్) వాహనం, కారు ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందగా, నలుగురికి ప్రమాదం తప్పింది. ఈ ఘటన బుధవారం అందోల్ మండల పరిధిలోని సంగుపేట వద్ద 161 నాందేడ్ హైవే పై చోటు చేసుకుంది. జోగిపేట ఎస్ఐ–2 మొగులయ్య తెలిపిన వివరాల ప్రకారం.. సంగుపేట గ్రామానికి చెందిన డప్పు నర్సయ్య (60) ఎక్సెల్ వాహనంపై చందంపేట గ్రామానికి వెళ్లి కిరాణా షాపు వస్తువులు, కోడి గుడ్లు తీసుకొని తిరుగు ప్రయాణం అయ్యాడు. నాందేడ్ హైవేపై స్వగ్రామానికి వస్తున్న క్రమంలోనే ఓ కుటుంబం నిజామాబాద్‌లో జరిగిన అంత్యక్రియల్లో పాల్గొని తిరిగి కారులో హైదరాబాద్‌కు వస్తుంది. సంగుపేట వద్దకు రాగానే వీరి కారు, ఎక్సెల్ వేగంగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఎక్సెల్‌పై ఉన్న నర్సయ్యకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదంలో కారు ముందు భాగం ధ్వంసం కాగా, బెలూన్‌లు తెరుచుకోవడంతో నలుగురు ప్రాణాలతో బయటపడ్డారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అంబులెన్స్ రాక ఆగిన ఊపిరి..

ప్రమాదం జరిగిన వెంటనే అక్కడున్న వారు 108 అంబులెన్స్‌కు, జోగిపేట పోలీసులకు సమాచారం అందించారు. అంబులెన్స్ సమయానికి రాకపోవడంతో తీవ్ర గాయాలైన నర్సయ్య 20 నిమిషాల పాటు ప్రాణాలతో కొట్టుమిట్టాడి మృతి చెందాడు. మృతదేహాన్ని ఓ ప్రైవేట్ అంబులెన్స్‌లో జోగిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అంబులెన్స్ సమయానికి వస్తే బతికేవాడేమోనని అక్కడున్న వారు అసంతృప్తిని వ్యక్తం చేశారు.

బైక్‌ను తప్పించబోయి..

- స్తంభాన్ని ఢీకొట్టిన తుఫాన్ వాహనం
- పలువురికి గాయాలు


ప్రమాద స్థలంలో తుఫాన్ వాహనం

అల్లాదుర్గం(మెదక్): బైక్‌పై వెళ్తున్న వ్యక్తి సడన్ బ్రేక్ వేయడంతో వెనుక వస్తున్న తుఫాన్ వాహనం అదుపుతప్పి స్తంభాన్ని ఢీకొట్టింది. ఈ ఘటన బుధవారం చిల్వెర గ్రామ శివారులో చోటు చేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం ఓ వ్యక్తి చిల్వెర నుంచి అల్లాదుర్గం వైపు బైక్‌పై వెళ్తున్నాడు. చిల్వెర శివారులోకి రాగానే పోలీసులు ఎదురుగా వస్తుండడంతో ఫైన్ వేస్తారనే భయంతో బైక్‌ను సడన్‌గా ఆపాడు. అతడి వెనుక నుంచే అల్లాదుర్గం వస్తున్న తుఫాన్ వాహనం బైక్‌ను తప్పించబోయి అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న స్తంభాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తుఫాన్‌లో ఉన్న పలువురికి గాయాలయ్యాయి. సంగారెడ్డి జిల్లా నిజాంపేట మండలం బచ్‌పల్లి గ్రామానికి చెందిన రాములుకు తీవ్ర గాయాలు కావడంతో 108 అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

హార్డ్‌వేర్ షాపులో చోరీ


సీసీ ఫుటేజీలో గుర్తు తెలియని వ్యక్తి

హత్నూర(సంగారెడ్డి): హార్డ్‌వేర్ షాపులో గుర్తు తెలియని దొంగలు చోరీకి పాల్పడిన ఘటన హత్నూర మండలం దౌల్తాబాద్‌లో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై సుభాష్ తెలిపిన వివరాల ప్రకారం.. దౌల్తాబాద్ గ్రామానికి చెందిన మమ్మద్ వాహబ్ హార్డ్‌వేర్ షాపు నిర్వహిస్తున్నాడు. దుండగులు రాత్రిపూట షాపు షటర్ తాళాలు పగులగొట్టి నగదుతో పాటు సామగ్రిని ఎత్తుకెళ్లారు. యజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. సీసీ కెమెరాల ఫుటేజీ పరిశీలిస్తున్నట్లు పేర్కొన్నారు.

మద్యం షాపులో..

హుస్నాబాద్: ఓ మద్యం షాపులో గుర్తు తెలియన వ్యక్తులు చోరీకి పాల్పడిన ఘటన హుస్నాబాద్ పట్టణంలోని అక్కన్నపేట రోడ్‌లో మంగళవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. షాపు వెనుక భాగంలోని తలుపులు పగులగొట్టి కౌంటర్‌లోని నగదు రూ.10 వేలు, రెండు ఫుల్ బాటిల్స్ అపహరించారు. సీసీ కెమెరా తీగలను కట్ చేసి రికార్డింగ్ డీవీఆర్ సెట్‌ను దొంగలించారు. షాపు నిర్వాహకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్‌లు తెలిపారు.